

# అన్నదాతకు మద్దతుగా 'నామ' మొదటి అడుగు

- ఎన్నికల రణక్షేత్రంలోకి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ
- పలు పుకార్లకు చెక్ పెడుతూ.. ఎన్నికలకు సిద్ధం
- గత పార్లమెంటు ఎన్నికల్లో ఆల్‌టైం రికార్డు విజయం సాధించిన నామ
- మాజీ సీఎం కేసీఆర్‌కు కుడి భుజంగా రాజకీయాలు నెరిపిన నామ
- పార్టీ కష్టాల్లో ఉన్న వేళ కొండంత అండగా నిలిచిన నామ
- బీర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు ఆధ్వర్యంలో రైతుల చెంతకు ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**


దశాబ్ద కాలం పాటు ఓ వెలుగు వెలిగిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. అందులో ఖమ్మం ఎంపీగా, బీఆర్ఎస్ లోక్ సభ పక్షనేతగా, అజాత శత్రువుగా పేరున్న నామ నాగేశ్వరరావుపై ఇటీవల వచ్చిన పలు పుకార్లకు చెక్ పెడుతూ ఎట్టకేలకు ఎన్నికల రణక్షేత్రంలోకి దూకారు. వచ్చీ రావడంతోనే స్వతహాగా రైతు బిడ్డ అయిన ఎంపీ నామ తన జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ పరిధిలో ఎండిపోతున్న పంటలను పరిశీలించేందుకే ప్రాధాన్యతనిచ్చారు. దాదాపు వందేళ్ల నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాను కరువు రక్కసి నుండి కాపాడి, అన్నపూర్ణలా, ఉమ్మడి జిల్లా వరప్రధాయనిలా విరాజిల్లిన పాలేరు రిజర్వాయర్‌లో కనీస నీటి నిల్వలు లేక పంటలు నిలువునా ఎండిపోయి ఆందోళనలో ఉన్న అన్నదాతలకు మద్దతుగా ఎంపీ నామ తన తొలి అడుగులు వేశారు. రైతులేనిదే రాజ్యం లేదని నమ్మే ఎంపీ నామ రాజకీయాలకు అతీతంగా అన్ని సందర్భాల్లోనూ కర్షకులను కనిపెట్టుకుని ఉంటారు. ఈ క్రమంలోనే తన నియోజకవర్గం అందునా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలక బహుళార్ధక సాధక ప్రాజెక్టుగా విరాజిల్లాల్సిన పాలేరు రిజర్వాయర్ నీరు లేక మైదనాన్ని తలపించచడం, డెడ్ స్టోరేజీకి వెళ్లడంతో తన పర్యటనకన్నా ముందు రైతులను కలుసుకోవాలన్న సదాశయంతో ఆదివారం ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి తదితర మండలాల్లో రైతుల పొలాలను పరిశీలించారు. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఈ మేరకు కర్షకుల చెంతకు వెళ్లగా అందులో క్రియాశీలకంగా ఎంపీ నామతో పాటు మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తో పాటు పలువురు ముఖ్యనతలు ఎండిన పొలాలు పరిశీలించారు. రైతులకు మద్దతుగా ఉంటామని రైతులకు భరోసా ఇచ్చారు.

### పుకార్లకు చెక్ పెడుతూ...

ఇటీవల ఎంపీ నామ నాగేశ్వరరావు బీఆర్ఎస్‌ను వీడుతున్నారన్న చర్చ ప్రసారమాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ మొట్టమొదటి జాబితాలోనే ఎంపీ నామ పేరును ఖమ్మం ఎంపీగా పోటీచేస్తారని ప్రకటించారు. ఇది జరిగి దాదాపు నెల రోజులు అయింది. కానీ



పాలేరు జలాశయం పరిధిలో ఎండిన పంటలు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత నామ



నామ నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాలో పర్యటించలేదు. సరికదా కనసీం ఒక అవగాహన సదస్సు, ప్రెస్ మీట్ కానీ నిర్వహించలేదు. అందుకు బలమైన కారణమే ఉంది. ఇటీవల తన కుమారుని వివాహం జరిపించడం, హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటుచేయడం, వివాహం సందర్భంగా రాకపోకలతో బిజీగా ఉన్న నామ ఎన్నికల ప్రచారానికి రాలేకపోయారు. అంతేకాదు.. ఎన్నికల సమయం కూడా దగ్గర లేకపోవడంతో పెండ్లి పనులు చక్క బెట్టుకున్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలో సాగర్ నీరు రాక పంట పొలాలు ఎండిపోతున్న వేళ అన్నదాతలకు మద్దతుగా ఇక తన మొట్టమొదటి అడుగు వేశారు.

### పార్టీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వేళ ఎంపీ నామ నిబద్ధత

గడిచిన ఐదేండ్లలో బీఆర్ఎస్ ఎంపీగా, లోక్‌సభ పక్షనేతగా క్రియాశీలక పాత్ర పోషించిన ఎంపీ నామ స్వతహాగా మౌనమునిలా, అజాత శత్రువుగా పేరుగాంచారు. రాజకీయంగా, సామాజికంగా చైతన్య వంతమైన గడ్డగా చెప్పుకునే ఖమ్మం జిల్లాలో గడిచిన శాసనసభ ఎన్నికల్లో వరుసగా మూడో సారి కూడా ఒక్కరంటే ఒక్కరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఆ వెంటనే బీఆర్ఎస్‌లో ముఖ్యమైన నాయకులు చాలా వరకూ ఎంపీలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లోకి వెళ్లడం చూస్తున్నాం. ఈ క్రమంలోనే ఎంపీ నామ కూడా కాంగ్రెస్ గూటికి చేరుతారన్న పుకార్లు షికారు చేశాయి. కానీ ఒక నిబద్ధత కలిగిన నాయకునిగా, సీనియర్‌గా పేరున్న నామ మాత్రం తనపై వచ్చిన పుకార్లను చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. 'తాను ఇప్పుడు ఎక్కడ ఉన్నానో..అక్కడే ఉన్నానంటూ...' ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో నవ్వుతూ సమాధానం ఇచ్చారు. కాగా తాజాగా అందరి అనుమానాలు, అంచనాలు తారుమారు చేస్తూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పనిచేస్తానని ఆదివారం ఖమ్మం జిల్లాలో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే క్రమంలో దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు మద్దతుగా ఎంపీ నామ అడుగులు కదిలాయి. నేటి నుండి అధికారికంగా ఎన్నికల ప్రచారాన్ని ఆరంభిస్తారు